ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 222 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 22 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

### ముర్ముకు స్వాగతం పలికి దర్శనం కల్పించిన టిటిడి



హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం)రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్న రాష్ట్రపతి శుక్రవారం ఉదయమే దర్శనం చేసుకున్నా ఆలయ మహాద్వారం వద్ద ఆమెకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆమెకు వేదాశీర్వచనాలిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. రాష్ట్రపతికి స్వామివారి చిత్రపటాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అందించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ..మిగతా 2లో

## హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి

### స్వాగతం పలికిన గవర్నర్, సిఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం) ఒకరోజు పర్యటనకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలి ముర్ముకు సిఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్, తదితరులు ఉన్నారు.

## కొత్తగా నాలుగు
# లేబర్ కోడ్‌లు
## తక్షణమే అమల్లోకి

**న్యూఢిల్లీ, నవంబర్ 21 (ప్రభాత ఉదయం)**

భారతదేశంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మిక చట్టాలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 29 కార్మిక చట్టాల స్థానంలో కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లు.. తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు కార్మిక శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ అధికారికంగా పేర్కొన్నారు.



**కొత్త చట్టాలు**

వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రత కోడ్ (2020), వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (2020)
కనీస వేతనానికి గ్యారెంటీ, గ్రాట్యూటీ, సామాజిక భద్రతకు పెద్దపీట వేయడంలో భాగంగానే ఈ కొత్త చట్టాలను తీసుకు రావడం జరిగింది. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలు ఇప్పటికే ఉన్న 29 కేంద్ర కార్మిక చట్టాల స్థానంలో ఉ ంటాయి. వేతనాల కోడ్ (2019): కనీస వేతనాలను నోటిఫైడ్ 'షెడ్యూల్డ్ ఉద్యోగాల'కు అనుసంధానించే మునుపటి వ్యవస్థను భర్తీ చేస్తూ, అన్ని రంగాలలో కనీస వేతనాలు, సకాలంలో వేతనాల చెల్లింపు హక్కును ఈ కోడ్ వివరిస్తుంది. పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020): ట్రేడ్ యూనియన్లపై నియమాలు, వివాద పరిష్కారం, తొలగింపులు/మూసివేతలకు సంబంధించిన షరతులను ఒకే చట్టంగా చేయడం, కొన్ని ప్రక్రియల ద్వారా పారిశ్రామిక సమ్మతిని క్రమబద్ధీకరించడం ఈ కోడ్ లక్ష్యం. సామాజిక భద్రత కోడ్ (2020): సామాజిక భద్రత, పీఎఫ్, ఈఎస్ఐసీ, ఇతర సంక్షేమ చర్యలకు చట్టపరమైన నిర్మాణాన్ని విస్తరిస్తుంది. అంతే కాకుండా మొదటిసారిగా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను సామాజిక భద్రతా పథకాల పరిధిలోకి తీసుకురావడానికి స్పష్టమైన ఎనేబుల్ ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టిస్తుంది.

OSHWC కోడ్ (2020): ఈ కోడ్ కార్యాలయ భద్రత, పని పరిస్థితులపై బహుళ చట్టాలను ఒకే ప్రమాణాల సమితిలో విలీనం చేస్తుంది.

**ప్రయోజనాలు**

కొత్త కార్మిక కోడ్‌ల ద్వారా కార్మికులకు అనేక ప్రయోజనాలు లభించనున్నాయి. ఇందులో 40 ఏళ్లు పైబడిన కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య తనిఖీలు, కార్మికులందరికీ కనీస వేతనం గ్యారెంటీ, అపాయింట్మెంటు ..మిగతా 2లో



## నన్ను అరెస్ట్ చేసే ధైర్యం
# రేవంత్‌కు లేదు

### రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

### నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమికి రెక్కలు

### భూములపై వాలిపోతున్న రేవంత్ ముఠా

**హైదరాబాద్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం)**

ఫార్ములా–ఈ కార్ కేసులో మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అనుమతించిన విషయం తెలిసిందే. దీనిపై కేటీఆర్ స్పందించారు. చట్టం తన పని తాను చేసుకు పోతుందని స్పష్టం చేశారు.

**లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం..**

"ఈ కేసులో ఏమీ లేదన్న విషయం అందరికీ తెలుసు. నన్ను అరెస్టు చేసే ధైర్యం ప్రభుత్వం చేయదు. ఫార్ములా–ఈ కార్ కేసులో తప్పు చేయలేదని వంద సార్లు చెప్పా. లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధం. రాష్ట్రంలో కాంగ్రెస్, భాజపా జాయింట్ వెంచర్ ప్రభుత్వం నడుస్తోంది. దేశంలోనే ఇంత అక్రమ బంధం ఎక్కడా ఉండదు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే పరువు పోతుందని రాజీనామాకు అవకాశం ఇస్తున్నారు. దానం నాగేందర్‌తో రాజీనామా చేయిస్తారు. దానంతో రాజీనామా చేయిస్తామని మావాళ్లతో అన్నారు. సాంకేతిక సాకులతో కడియం శ్రీహరిని కాపాడే అవకాశం ..మిగతా 2లో


## దక్షిణాఫ్రికా చేరుకున్న
# ప్రధాని మోదీ

### జీ20 సమావేశంలో పాల్గొననున్న ప్రధాని



**న్యూఢిల్లీ, నవంబర్ 21 (ప్రభాత ఉదయం)**

ప్రధాని నరేంద్ర మోదీ దక్షిణాఫ్రికా చేరుకున్నారు. జీ20 వార్షిక సమావేశం నిమిత్తం ఆయన ఈ పర్యటనకు వెళ్లారు. ఈ ఏడాది సమావేశం దక్షిణాఫ్రికా అధ్యక్షతన జరుగుతోంది. వాటర్‌క్లూఫ్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో దిగిన ప్రధాని మోదీకి దక్షిణాఫ్రికా అధికారులు సంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక సాంస్కృతిక కళా ప్రదర్శనలతో ఆహ్వానించారు. "జీ20 సమావేశం కోసం జోహన్నెస్‌బర్గ్‌కు చేరుకున్నాను. కీలక అంశాలపై ప్రపంచాధినేతలతో చర్చించేందుకు వేచి చూస్తున్నాను. వివిధ దేశాలతో సహకారాన్ని పెంపొందించుకోవడం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు ..మిగతా 2లో



### అమెరికాతో
## 93 మిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందం

### అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ సరఫరాకు అంగీకారం

**న్యూఢిల్లీ, నవంబర్ 21 (ప్రభాత ఉదయం)**

భారత్–అమెరికాల మధ్య కీలకమైన రక్షణ ఒప్పందం కుదిరింది. దీంతో అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ మన దేశానికి అందనుంది. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు వరంలా వచ్చిన ఈ ఆయుధానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ ఉంది. భుజం మీద నుంచి గురిపెట్టి ప్రయోగించే ఈ మిసైల్.. కొన్ని వందల సంఖ్యలో రష్యన్ ట్యాంకులను పేల్చేసింది. ఈ క్రమంలో అమెరికాతో 93 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను భారత్‌కు విక్రయించేందుకు అగ్రరాజ్యం ఆమోదించింది. జావెలిన్ ట్యాంక్ విధ్వంసకర క్షిపణిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ..మిగతా 2లో

## ఢిల్లీలో ప్రమాదకరంగా
## గాలి కాలుష్యం

### మరింతగా క్షీణించినట్లు గుర్తింపు

### స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధింపు

### ప్రజలను హెచ్చరించిన అధికారులు



**న్యూఢిల్లీ, నవంబర్ 21 (ప్రభాత ఉదయం)**

ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలకు చేరుకుంది. పలు ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. గత నెల ఢిల్లీ – ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోని 80 శాతం ఇళ్లలో విషపు గాలి కారణంగా కనీసం ఒక సభ్యుడు అనారోగ్యానికి గురైనట్లు సర్వేలు చెబుతున్నాయి. గాలి కాలుష్యం కారణంగా ప్రజల ఆయుర్దాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కూడా పూర్తి స్థాయిలో ప్రజలకు రక్షణ లభించటం లేదు. మాస్కులు, ఎయిర్ ప్యూరిఫైయర్లు కొంత మేరకు మాత్రమే రక్షణ ఇస్తాయని, ..మిగతా 2లో

# ప్రజల రవాణా సౌకర్యాలను మరింత పెంచుతాం



ఆరంగర్ చౌరస్తాలో నూతన ఆర్టీసీ సర్వీస్ 316 ఎల్ ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు



బస్సు ప్రారంభోత్సవంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ అధికారులు

## చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎం (ఓ) బాబునాయక్

రాజేంద్రనగర్, నవంబర్ 21 (ప్రభాత ఉదయం) ప్రజల రవాణా సౌకర్యాలను మరింత పెంచుతామని చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎం (ఓ) బాబునాయక్ అన్నారు. శు క్రవారం ఆరాంఘర్ చౌరస్తా నుండి గచ్చిబౌలి వైపు వెళ్లే ఆర్టీసీ నూతన సర్వీసులో చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎం (ఓ) బాబునాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరాంఘర్ చౌరస్తా నుండి గచ్చిబౌలి వైపు ప్రయాణించే ప్రయాణికులు, ముఖ్యంగా సాఫ్ట్వర్ ఉద్యోగుల సౌకర్యార్థం, టీ.జి.ఎస్.ఆర్టీసీ, హైదరాబాద్ రీజియన్ నేరుగా బస్సు సర్వీసులను ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కొత్త సర్వీసులు (శుక్రవారం) ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాల నుండి ఆరాంఘర్ దిగే ప్రయాణికులు అలాగే ఆరాంఘర్ పరిసర ప్రాంతాలైన శివరాంపల్లి, శ్రీరామ్ కాలనీ, మదుటసి కాలనీ, కాటేదాన్, భవానీ కాలనీ, బుద్వేల్ తదితర ప్రాంతాల ప్రజలు ఈ సర్వీసులను సౌకర్యవంతంగా వినియోగించవచ్చన్నారు. ఈ బస్సులు ఆరాంఘర్ చౌరస్తా నుండి బయలుదేరి డైరీ పార్క్, ఉప్పరపల్లి, హైదర్గూడా, అత్తాపూర్, లంగర్ హౌస్, రింగ్ రోడ్, బాపూనగర్, సన్ సిటీ, కాళీ మందిర్, అప్ప జంక్షన్, నార్సింగ్ మార్గంగా ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్ మీదుగా గచ్చిబౌలి చౌరస్తా వరకు నడపబడతాయి.సాఫ్ట్వేర్ ఉ ద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ఈ నూతన బస్సు సర్వీసులను వినియోగించి తమ సమయం మరియు ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజల స్పందన అనుకూలంగా ఉంటే, ఉన్నతాధికారుల అనుమతితో భవిష్యత్తులో మరిన్ని సర్వీసులను కూడా పెంచే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ మార్గంలో ఉదయం 6:45, 7:45, 9:05, 10:05, 11:15, 12:15, మధ్యాహ్నం 13:50, 14:50, 16:00, 17:00 రెండవసారి ఉదయం 7:50, 8:50, 10:10, 11:10, మధ్యాహ్నం 12:20, 13:30, 14:55, 15:55, 18:45, 19:45 సమయాల కు నడుస్తాయన్నారు.ఈ సర్వీసులకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం కింది నెంబర్లను సంప్రదించవచ్చన్నారు. 7382818603,9959225137, 9959226135 ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజనల్ మేనేజర్ సుధా పరిమళ, ట్రాఫిక్ పోలీస్ సిఐ గణేష్ , డిపో మేనేజర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.





# దక్షిణాఫ్రికా చేరుకున్న ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి...

తీసుకెళ్లడం, తద్వారా యావత్ ప్రజానీకానికి మెరుగైన భవిష్యత్తును అందించడమే లక్ష్యం" అని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆఫ్రికాలో జరుగుతున్న మొదటి జీ20 సమావేశం ఇది. 2023లో భారత అధ్యక్షతన జరిగిన సమ్మిట్‌లోనే ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20 కూటమిలో సభ్యత్వం లభించింది. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే మోదీ పలువురు ప్రపంచాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు కూడా జరపనున్నారు. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికాతో కూడిన ఐబీఎస్ఏ కూటమి ఆరో త్రైపాక్షిక సమావేశంలోనూ మోదీ పాల్గొననున్నారు. ప్రవాస భారతీయులనూ పలకరించనున్నారు. ఈ జీ20 సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరు కావడం లేదు.

# శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

మొదటి పేజీ తరువాయి...

ముర్ము ఆలయం నుంచి పద్మావతి అతిథి గృహానికి బయలుదేరారు. దారి మధ్యలో రాంభగీచ వసతిగృహం వద్ద వాహనం దిగి అక్కడి భక్తులతో మాట్లాడారు. వారికి చాక్లెట్లు కూడా పంచారు. రాష్ట్రపతి రాకతో తిరుమలలో భారీగా భద్రత కల్పించారు. ఆమెపర్యటించిన ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టారు. అయితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల పర్యటనలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది.. రాంభగీచ సర్కిల్ వద్ద ప్రోటోకాల్ పక్కన పెట్టేసి భక్తులను పలకరించారు రాష్ట్రపతి ముర్ము.. కాన్వాయ్ నుంచి దిగి రోడ్డు పక్కన నిలిచిఉన్న భక్తులను ప్రేమగా పలకరించిన రాష్ట్రపతి.. భక్తులతో కరచాలనం చేసి చాకెట్స్ పంపిణీ చేశారు.. ఇక, ఊహించని ఘటనతో భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.. అయితే, రాష్ట్రపతి అనూహ్యంగా కాన్వాయ్ దిగడంతో.. భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. రెండు రోజుల పర్యటన భాగంగా.. గురువారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. ఆ తర్వాత తిరుమల చేరుకుని శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో బస చేశారు.. ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.. అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

# నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్‌కు లేదు

మొదటి పేజీ తరువాయి...

ఉందేమోనని చూస్తున్నారు" అని కేటీఆర్ అన్నారు.

**పెద్ద భూకుంభకోణానికి తెరలేపారు..**

"పదేళ్లు నేను మంత్రిగా ఉన్నప్పుడు భూముల కోసం చాలా మంది వచ్చారు. డబ్బులు ఇస్తామన్నా కూడా భూమార్పిడికి మేం అంగీకరించలేదు. ఇవాళ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద భూకుంభకోణానికి తెరలేపింది. దీనికి కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. అజమాబాద్ భూముల క్రమబద్ధీకరణకు చట్టం తీసుకొచ్చాం. వంద శాతం రుసుముతో క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చాం. ఇతరుల చేతిలో ఉంటే 200 శాతం రుసుము పెట్టాం. ప్రభుత్వం ఇప్పుడు చౌకగా భూములు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోంది. 9,292 ఎకరాలు ఎవరి సొత్తు అని సంతర్పణ చేస్తున్నారు?ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉ పసంహరించుకోవాలి. 30 శాతం డబ్బులు చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేస్తామంటున్నారు.

భూముల విషయంలో న్యాయ పోరాటం చేస్తాం. కొనేవారు కూడా చిక్కుల్లో పడతారు జాగ్రత్త. భవిష్యత్‌లో వచ్చేది మా ప్రభుత్వమే. రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలో చిక్కితే కొనుగోలుదారులు నష్టపోతారు. %దీ=నా% హయాంలో ఇలాంటివి ఎప్పుడూ చేయలేదు. అధికారంలోకి వచ్చాక బాధ్యులను వదిలిపెట్టబోం. ఇది రూ.5 లక్షల కోట్ల విలువైన భూకుంభకోణం. రూ.50 వేల కోట్లు వెనకేసుకోవాలని రేవంత్ చూస్తున్నారు. భాజపా నేతలు కూడా ఈ భూకుంభకోణాన్ని అడ్డుకోవాలి" అని కేటీఆర్ అన్నారు.

# కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లు

మొదటి పేజీ తరువాయి...

లెటర్ గ్యారెంటీ, సమాన పనికి సమాన వేతనం, మహిళల ఆమోదం, భద్రత చర్యలకు లోబడి రాత్రి వేళలో స్త్రీలు పని చేయడానికి అనుమతి, 40 కోట్ల మంది కార్మికులకు సోషల్ సెక్యూరిటీ, ఏడాది తర్వాత ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిస్‌కు గ్రాట్యూటీ, ఓవర్ టైంకు రెట్టింపు వేతనం, ప్రమాదకర రంగాల్లో పనిచేసే వారికి 100 ఆరోగ్య రక్షణ, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం కార్మికులకు సామాజిక న్యాయం వంటివి ఉన్నాయి.

**నరేంద్ర మోదీ ట్వీట్**

"శ్రమేవ్ జయతే! నేడు, మన ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్‌లను అమలులోకి తెచ్చింది. ఇది స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అత్యంత సమగ్రమైన, ప్రగతిశీల కార్మిక ఆధారిత సంస్కరణలలో ఒకటి" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ .. తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

# ఢిల్లీలో ప్రమాదకరంగా గాలి కాలుష్యం

మొదటి పేజీ తరువాయి...

కాలుష్యాన్ని నియంత్రించడానికి పాలసీలో మార్పులు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధించింది. ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుండటంతో స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఆపేయాలని రెండు రోజుల క్రితం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం అయింది. సాధారణంగా ఢిల్లీలోని స్కూల్స్ చలికాలంలో స్పోర్ట్స్ మీట్స్ కండక్ట్ చేస్తూ ఉంటాయి. కాలుష్యం పెరగటంతో నవంబర్, డిసెంబర్ నెలలో నిర్వహించే క్రీడలను నిర్వహించొద్దని ఢిల్లీ ప్రభుత్వం స్కూళ్లను ఆదేశించింది. ఇకపోతే ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యతలు నమోద్యాయి. దీంతో ఆ గాలి ప్రాణాంతకంగా మారుతుందని పలువురు నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో 80 శాతం నివాసితులు గాలి నాణ్యతలు క్షీణించడం వల్ల అనారోగ్యాలపాలవుతున్నారు. కనీసం కుటుంబంలో ఒక్కరైనా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని పలు సర్వేలు వెల్లడించాయి. మాస్కులు, ఎయిర్ ప్యూర్గి÷యైర్‌లు కొంత రక్షిస్తున్నప్పటికీ.. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏడాది పొడవునా కచ్చితమైన విధాన మార్పు అవసరమని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి ఎక్యూఐ 370 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ తీవ్ర స్థాయిలో నమోదైంది. చాందినీ చౌక్, ఆనంద్ విహార్, ముండ్కా, బవానా, నరేలా, డిటియు-వజీర్‌పూర్‌లలో 400కి పైగా ఎక్యూఐ నమోదైంది. 18 పర్యవేక్షణా కేంద్రాల్లో 400 పైగానే ఎక్యూఐ నమోదైంది. గత కొన్ని రోజుల్లోనే కాకుండా.. వచ్చే వారంలో ఆరు రోజులు కూడా తీవ్ర ప్రమాదకర స్థాయిలోనే గాలి నాణ్యతలు నమోదయ్యే అవకాశం ఉందని భూశాస్త్రాల మంత్రిత్వశాఖ అంచనా వేసింది. గాలి కదలికలు సరిగ్గా లేకపోవడం, శీతాకాలం కారణంగా గాలి నాణ్యతలు ప్రమాదకర స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీలో గాలి ఎంత కాలుష్యంగా ఉందో నెట్టింట వైరల్ అవుతున్న ఫొటోలే నిదర్శనం. దేశ రాజధానిలో వాయు కాలుష్యం పెరిగిపోవటానికి పంట వ్యర్థాలను తగలబెట్టడం ప్రధాన కారణం అవుతోంది. ఢిల్లీ చుట్టు పక్కల ఉండే రాష్ట్రాల ప్రజలు పెద్ద సంఖ్యలో పంట వ్యర్థాలను తగలబెడుతూ ఉన్నారు.

# అమెరికాతో 93 మిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందం

మొదటి పేజీ తరువాయి...

ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్ విధ్వంసకర ఆయుధాన్ని ప్రయోగించిన ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళు తుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా.రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం కోసం రష్యా తమ ట్యాంకులపై లోహపు బోన్లను అమర్చిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. మొత్తం 93 మిలియన్ డాలర్ల ఆయుధాలను విక్రయించేందుకు భారత్-అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. ఇందులో 45.7 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ మిసైల్ వ్యవస్థలు, సంబంధిత హార్డ్‌వేర్‌ను అగ్రరాజ్యం అందించనుంది.

# పంటకు బోనస్... అన్నదాతకు భరోసా

## వనపర్తి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి

## రైతుల ఖాతాలో బోనస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హర్షం



కొత్తకోట, నవంబర్ 21 (ప్రభాత ఉదయం) రైతు పండించిన పంటకు బోనస్ తో అన్నదాతకు భరోసా లభించిందని వనపర్తి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ... రాష్ట్రంలోని ప్రజా పరిపాలన ప్రభుత్వం రైతులకు వెన్న దున్నుగా ఉంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి, దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి కి కిసాన్ కాంగ్రెస్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆరు కాలం కష్టపడి వరదలు తుపానులకు నష్టపోయిన రైతన్నలకు ఈ బోనస్ తో రైతన్నలకు ఎంతో తోడవుతుందన్నారు.ప్రభుత్వం వడ్లు అమ్మిన రైతన్నలకు క్వింటాలుకు రూ.500 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం రైతుల ఖాతాలకు నగదు జమ చేయడం జరుగిందన్నారు.తొందరలోనే రైతులతో కలిసి సన్నాళ్ల సంబరాలు చేస్తామన్నారు.



## ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్ పల్లి, నవంబర్ 21 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల పరిశీలకుడిగా నూతనంగా నియమించబడ్డ ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ని గాంధీ భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, పీసీసీ ఉపాధ్యక్షులు టి. కుమార్ రావు, కైలాష్ కుమార్, అనంతరం ఇరువురి భేటీలో పలు అంశాల గురించి సుదీర్ఘంగా చర్చించారు.

# కోర్టు ఆదేశాల ధిక్కరణ... కంటెంప్ట్ కేసు వేస్తా

## అధికారుల తీరుపై కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి ఆగ్రహం



కూకట్ పల్లి, నవంబర్ 21 (ప్రభాత ఉదయం) అక్రమ నిర్మాణం పట్ల చర్యలు చేపట్టని అధికారులపై కోర్టు ధిక్కరణ కింద తప్పకుండా కేసు వేయాల్సి వస్తుందని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి వినాయకనగర్ కాలనీలో అనుమతులకు మించి అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మించారు. అక్రమ నిర్మాణం పట్ల చర్యలు తీసుకోవాలని పదే పదే కూకట్ పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చెయ్యడం జరిగిందని పేర్కొన్నారు. సర్కిల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో అప్పటి కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ను, ప్రస్తుతం అపూర్వ చౌహాన్ కు కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చెయ్యడం జరిగిందని తెలిపారు. అభిలాష అభినవ్ చర్యలు చేపట్టాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో హై కోర్టులో కేసు వేయాల్సి వచ్చిందని అన్నారు. నెల రోజుల్లో అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టి కోర్టుకు తెలపాలని కోర్టు కోరింది. అప్పటికీ అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద కేసు వేయడం జరిగిందని తెలిపారు. సుమారు సంవత్సరం గడుస్తున్నా అక్రమ నిర్మాణం పట్ల చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారని పేర్కొన్నారు. కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కలిసి అక్రమ నిర్మాణం పట్ల హైకోర్టు చెప్పిన మాటలను గుర్తు చేయడం జరిగిందని అన్నారు. అపూర్వ చౌహాన్ ఎట్టకేలకు స్పందించి కూల్చివేతలకు పోలీసు బందోబస్తును ఇవ్వాలని బాలానగర్ పోలీసులకు ఒక లేఖ కూడా రాశారు. కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ మళ్ళీ ఒక లేఖను మళ్ళీ బాలానగర్ పోలీసులకు బందోబస్తు విషయంలో రాశారు. అక్రమ నిర్మాణం కూల్చివేసేందుకు అధికారుల నిర్లక్ష్య ధోరణి పట్ల అధికారుల మీద హై కోర్టులో కోర్టు ధిక్కరణ కింద కంటెంప్ట్ కేసు వేస్తానని తెలిపారు.

# శాస్త్రీయ దృక్పథమే సమాజ ప్రగతికి పునాది: రామచంద్రయ్య



నాగారం ప్రభుత్వ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ప్రొఫెసర్ రామచంద్రయ్య

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (నాగారం మున్సిపాలిటీ) నవంబర్ 21 ( ప్రభాత ఉదయం):- శాస్త్రీయ దృక్పథమే సమాజ ప్రగతికి పునాది అని రిటైర్డ్ ప్రొఫెసర్ రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం నాగారం ప్రభుత్వ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి కీసర మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే అలవాటు, పరిశోధనా మైండ్‌సెట్ తప్పనిసరిగా పెంచుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల ప్రారంభానికి ముందు ప్రధానోపాధ్యాయులు సి హెచ్ రాములు ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఇప్పటి యువతలో శాస్త్రీయ దృక్పథం అత్యంత కీలకం. 8, 9, 10వ తరగతుల్లో మీరు నేర్చుకున్న విద్య భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని చెప్పారు. ప్రశ్నించే స్వభావం, నిజానిజాలను తార్కికంగా విశ్లేషించే అలవాటు, పరిశోధనా దృష్టి, అలవర్చుకోవాలన్నారు. ఇవి ప్రతి విద్యార్థిలో విజ్ఞానం పెరిగినప్పుడే అన్నింటా రాణిస్తారని అన్నారు.సందేహం వచ్చిన ప్రతిసారీ గురువులను, పుస్తకాలను, విజ్ఞాన వనరులను ఆశ్రయించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి పనిని చేసే ముందు ఆలోచన చేయాలని చెప్పారు. ప్రతిదీ అంగీకరించే ముందు అంగీకరించిన తర్వాతనే పరిశీలించాలన్నారు. కేవలం మార్కులు కోసం కాదు, విజ్ఞానాన్ని ప్రేమించే అలవాటు పెంపొందించడం కోసం చెకుముకి పరీక్షలు కీలకమని చెప్పారు. ఎందుకు? ఎలా? అనే ప్రశ్నలు ఎప్పటికప్పుడు విద్యార్థుల్లో జీవించి ఉండాలని సూచించారు. తరువాత విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలు నవంబర్ 28న కొంపల్లి సుందర అకాడమీ ఇన్స్టిట్యూషన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన పాఠశాలలు తెలుగు మీడియం నాగారం, కీసర, దమ్మాయిగూడ ప్రభుత్వ పాఠశాలలు.

ఇంగ్లీష్ మీడియం నాగారం, కీసర, చీర్యాల్ ప్రభుత్వ పాఠశాలలు.

ప్రైవేట్ పాఠశాలలు సెరినిటీ మోడల్ హై స్కూల్ నాగారం, సెరినిటీ మోడల్ హై స్కూల్ కీసర, వివిఎంఆర్ గ్రామర్ హై స్కూల్ బండ్లగూడ. అలాగే సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నుండి కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, చార్మినార్, పాఠశాలలు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కీసర మండల నాయకులు శేషగిరిరావు, ఎంఎల్ చౌదరి, కృష్ణ, రాజన్ సింగ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది

## జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 21(ప్రభాత ఉదయం)జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జి. కృష్ణయ్య ఎ.ఆర్.ఎస్సై గా పదోన్నతి పొందిన నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ టి. శ్రీనివాస రావును మర్యాదపూర్వకంగా కలిశారు.ఎస్పీ కొత్తగా పదోన్నతి పొందిన అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ కు స్టార్ తొడిగి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఉద్యోగ జీవితం లో పదోన్నతి ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా విధుల పట్ల మరింత బాధ్యతను కూడా పెంచుతుంది. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. వెంకటేష్, ఆర్. ఎస్సై విజయభాస్కర్, పాల్గొన్నారు.



మాదాపూర్ సున్నం చెరువు వద్ద ఉన్న హనుమాన్ దేవాలయాన్ని సందర్శించిన రవికుమార్ యాదవ్ తోపాటు బీజేపీ నాయకులు

# హిందూ దేవాలయాల జోలికొస్తే సహించేది లేదు

## బిజెపి నాయకులు రవికుమార్

శేరిలింగంపల్లి ,నవంబర్ 21,(ప్రభాత ఉదయం)హిందూ దేవాలయాల జోలికి వస్తే సహించేది లేదని బీజేపీ శేరిలింగంపల్లి శాసన సభ కంటేస్టెడ్ ఎమ్మెల్యే ఎం. రవికుమార్ యాదవ్ హైడ్రా అధికారులను హెచ్చరించారు.మాదాపూర్ సున్నం చెరువు సమీపంలోని హనుమాన్ ఆలయాన్ని తొలగించేందుకు హైడ్రా అధికారులు ప్రయత్నించిన విషయం విధితమే. గత రెండు రోజులుగా హిందూ సంఘాలు సున్నం చెరువు సమీపంలో ఉన్న హనుమన్ దేవాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నారు. నిరసన వ్యక్తి చేస్తున్న భక్తులు రవికుమార్ పరామర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. గత 20 సంవత్సరాలుగా మాదాపూర్ సున్నం చెరువు వద్ద ఉన్న పురాతన హనుమాన్ దేవాలయాన్ని హైడ్రా అధికారులు తొలిగించాలని చూడగ బీజేపి ఆధ్వర్యంలో విహెచ్పి, భజరంగ్ దళ్ కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని అడ్డుకోవడం జరిగింది, రవి కుమార్ యాదవ్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. హైడ్రా అధికారులు హనుమాన్ దేవాలయాన్ని తొలిగించాలని చూడటం ఎంత వరకు భావ్యమని ప్రశ్నించారు, పెద్దలకు ఒక న్యాయం పేదలకు ఒక న్యాయం చేస్తున్న హైడ్రా అధికారులు తీరు సరైనది కాదని నిన్న మొన్నటి వరకు సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన ఇప్పుడు హిందూ దేవాలయాల జోలికి వస్తున్నారని మండి పడ్డారు. హైడ్రా అధికారులు చెస్తున్న అన్యాయాలను దేవుడు ప్రజలు గమనిస్తున్నారని ఆరోపించారు. నానక్ రామ్ గూడ లోని కాళి మాత అమ్మవారి ఆలయాన్ని ఇలాగే తొలగించాలని నోటీసులిస్తే అడ్డుకున్నామని ఇప్పుడు సున్నం చెరువు హనుమాన్ టెంపుల్ తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. రోడ్ మధ్యలో ఉన్న దర్గాలు ముస్లిం స్మశాన వాటికలను పక్కనే ఉన్న దర్గా జోలికి వెళ్ళే దమ్ము లేని మీకు హిందువులు ఎంతో పవిత్రంగా పూజలు చేసే దేవుళ్ళు అంటే చులకన భావనాని అన్నారు, హిందూ దేవాలయాల జోలికి వస్తే సహించేది లేదన అడ్డుకుని తీరుతామని విగ్రహాలు దేవాలయాలు తొలగించేందుకు హైడ్రా అధికారులు చూపుతున్న అత్యుత్సాహం కబ్జాలు ఆక్రమణల మీద దృష్టి పెడితే బాగుంటుదన్నారు. దేవాలయాల జోలికి వస్తే హిందువులందరు సంఘటితమై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా హర్బన్ ఉపాధ్యక్షుడు రాధా కృష్ణ యాదవ్, డివిజన్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, మహేందర్ యాదవ్, శివ కుమార్ యాదవ్, లింగస్వామి, నరేష్, రాము యాదవ్, సుమన్, శీను నాయక్, స్రవంతి, బజరంగ్ దల్,విశ్వహిందూ పరిషత్ వారు పాల్గొన్నారు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఎం సంగీత గౌరీశంకర్

# అత్తాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన

బుద్వేల్, నవంబరు 21 (ప్రఖాత ఉదయం) : అత్తాహర్ డివిజన్ హైదర్ గూడ న్యూ ఫ్రెండ్స్ కాలనీలో రూ.50లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మోం ద్ర సంగీత గౌరీశంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సుదర్భంగా ఆమె మాట్లాడుతూ, గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో అత్తాపూర్ డివిజన్ ను అన్ని రంగాలలో తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అత్తాపూర్ డివిజన్ ప్రజలకు సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించిన ఆ భగవంతునికి, ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రములో స్థానిక నాయకులు మోంద్ర కొమురయ్య, సులిగె వెంకటేశ్, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గతుకుల రోడ్లను మరమ్మత్తు చేయడానికి రూ.44 లక్షల మంజూరు :**

హైదర్ గూడ పరిసర బస్తీలు, కాలనీలలో గతుకుల రోడ్లు చాలా ఉన్నాయని ఇటీవల స్థానిక నాయకులు ఎం. కొమురయ్య, వై.శ్రీధర్, ఎం.రామేశ్వర్రావు, మ్యాడం మదుసూదన్ తదితరులు గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ డ్డిని కలిశారు. స్పందించిన ఆయన అత్తాపూర్ డివిజన్ లో గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మత్తులు చేయడానికి రూ. 44 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో హైదర్ గూడ పరిసర బస్తీలు, కాలనీలలో ఉన్న గుంతలు పడ్డ రోడ్లనన్నింటిని బాగు చేయడం జరుగుందని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కి, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేంధర్ రెడ్డికి, ఈఈ నరేందర్ గౌడ్ కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.



# పాఠశాలకు మంజూరైన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్21(ప్రభాత ఉదయం) ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన నిధులు దుర్వినియోగం పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పట్టణ ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ ఆద్వర్యంలో ధరూర్ మండలంలో ఉప్పేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలపై, పాఠశాలకు మంజూరైన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ మాట్లాడుతూ... ఉప్పేర్ జడ్పీహెచ్ఎస్ లో బాలికలకు సరిపడు వాష్ రూం వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న సందర్భంలో ఇలాంటి దయనీయ పరిస్థితులు నెలకొనడం బాధకరమన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రధాన్ మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (%ూమీ=×%) పథకం మరియు ఇతర నిధుల ద్వారా 2024%-%25 సంవత్సరానికి రూ.12,38,000, అలాగే 2025 సంవత్సరానికి రూ.93,000 మంజూరు చేసినప్పటికీ, ఆ నిధులు పాఠశాల అభివృద్ధికి వినియోగించలేదని ఆరోపించారు.విద్యార్థులు, గ్రామస్థుల నుండి వచ్చిన ఫిర్యాదుల ప్రకారం, గతంలో పాఠశాలకు హెడ్‌మాస్టర్‌గా పనిచేసిన గౌరి శంకర్ పదవీకాలంలో నిధుల వినియోగంపై అనుమానాస్పద అంశాలు ఉన్నట్టు తెలుస్తోందన్నారు. అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలన్నారు.పాఠశాలకు మంజూరైన నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని, నిధులను దుర్వినియోగం చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మహిళా విద్యార్థులకు తక్షణమే వాష్ రూమ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, పాఠశాల మొత్తం మౌలిక వసతుల అభివృద్ధికి వెంటనే చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు.



అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన శాంతి శ్రీనివాసరెడ్డి.

# ప్రతి ఒక్కరు అంగన్వాడి సేవలను వినియోగించుకోవాలి

## కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) నవంబర్ 21 ( ప్రభాత ఉదయం):- ప్రతి ఒక్కరూ అంగన్వాడి కేంద్రాన్ని వినియోగించుకోవాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఓల్డ్ ఆల్వాల్ హరిజన బస్తీలోని అంగన్వాడి కేంద్రం ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాలనీవాసులకు సూచించారు.0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు ఆరోగ్య సంరక్షణ సేవలతో పాటు ప్రారంభ విద్య పిల్లల అభివృద్ధి కార్యకలాపాలను అందిస్తాయని ఆమె తెలిపారు. పిల్లలకు సుమారు 20 మంది పిల్లలకు గుడ్లు అందిస్తారని పేర్కొన్నారు. నియమ నిబంధనలను అనుసరించి చేపడతామని అంగన్వాడి టీచర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీచర్ శ్రీ వేణి, హెల్పర్ సోనీ, స్థానికులు అరుణ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ చిన్న భీమ రాయుడు మృతి

## సంఘటన స్థలాన్ని పరిశీలించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల సీఐ టి.శ్రీను

## కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన గద్వాల ఎమ్మెల్యే



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ చిన్న భీమరాయుడు (ఫైల్ ఫోటో)

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 21(ప్రభాత ఉదయం)ధరూర్ మండలం జాంపల్లి గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామ మాజీ సర్పంచ్ చిన్న భీమరాయుడు(45) మృతి చెందారు. కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిన్న భీమరాయుడు వ్యక్తిగత పనుల మీద గద్వాలకు వచ్చి తిరుగుప్రయాణంలో ద్విచక్ర వాహనం పై వెళ్తున్న క్రమంలో ధరూర్ మండలం జాంపల్లి గ్రామం వద్ద వెనుక నుంచి బొలేరో వాహనం ఢీకొనడంతో సంఘటన స్థలంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, గద్వాల సీఐ టి.శ్రీను, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. జరిగిన సంఘటన పై అన్నీ కోణాలలో పరిశీలించారు. చిన్నభీమరాయుడు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమితం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలున్నారు. గద్వాల ఆసుపత్రి వద్ద చిన్న భీమరాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడశానుభూతి తెలియజేశారు. కుటుంబీకులు ఎవరు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని గద్వాల ఎమ్మెల్యే భరోసా కల్పించారు. గద్వాల ఎమ్మెల్యే వెంటా నాయకులు, తదితరులు ఉన్నారు.

# విద్యుత్ సరఫరా నిలిపివేత

### నేడు రాజేంద్రనగర్, శివరాంపల్లి, గగన్ పహాడ్, కిస్మత్ పూర్, హిమాయత్ సాగర్‌లలో..



రాజేంద్రనగర్/బండ్లగూడ ,నవంబర్ 21(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధి లోని ఉ ప్పరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మత్రా నిమిత్తం శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని గోల్డెన్ హైట్స్ కాలని, హ్యాపీ హెూమ్స్ కాలనీ, సత్సంగ్, జన చైతన్య ఫేస్ 1,2,3,4, డైరీ ఫారం, జన చైతన్య ఫేస్ 3,4 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉ ంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**శివరాంపల్లి లో**

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని శివరాంపల్లి, ప్రశాంత్ కాలనీ, హసన్ నగర్, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం రెండున్నర వరకు, శ్రీదేవి కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు శ్రీదేవి కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, యూనివర్సిటీ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు.

**కిస్మత్పూర్ లో**

కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు డిఫెన్స్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని ఆర్మీ నిర్మాణ, ట్రంప్ విల్ల, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్ కి విల్లా, ఖాదర్ ఎన్నారై, 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు డాన్ బెస్కో పీటర్ పరిధిలో మీ చల్ కాలనీ, వినాయక నగర్, డిడి కాలనీ, కాళీ మందిర్, ఎన్ఎఫ్సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, అరుణోదయ , జి ఆర్ నగర్, మాచన్పల్లి ఎంక్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఎంత రాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**హిమాయత్ సాగర్ లో**

హిమాయత్ సాగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరమత్ల నిమిత్తం శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఖాళీ మందిర్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీనగర్, భవాని కాలనీ, బైరాగి గూడ, శివ సాయి నగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధంగూడ, ప్రాంతాలు గంధం గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన హిమాయత్ సాగర్, గంధం గూడ, వెస్ట్ ఎండ్ కాలనీ, శాంతినగర్, లక్ష్మీ నగర్, హైదర్ షాకోట్ గ్రామం , మాధవి నగర్ లీడర్ పరిధిలో గల ప్రాంతాలైన మాధవి నగర్, కపిల్ నగర్, ఫోర్ట్ వ్యూ అపార్ట్మెంట్, లలో మధ్యాహ్నం రెండు గంటల నుండి 2:30 వరకు, స్నేహిత హిల్స్ పీటర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి రెండున్నర వరకు స్నేహిత హిల్స్ ఫేస్1,2, ఇండియన్ పబ్లిక్ స్కూల్, రాయల్ ఓక్ ఫర్నిచర్, బ్రాడ్ వే హెూటల్, మధ్యాహ్నం మూడు గంటల నుండి మూడున్నర గంటల వరకు భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన నర్సారెడ్డి కాలనీ, రాధా నగర్ ఫేస్-2, కేకే కన్వెన్షన్, హైదర్ షాకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రస్తావనగర్, తిరుమల గార్డెన్, రాధా రియాప్స్, ఫేస్ -2, పావని హార్మోని విల్లా, సాయి శక్తి అపార్ట్మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరానిలు వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు

**గగన్ పహాడ్ లో**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమత్ల నిమిత్తం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉ ంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని పద్మశాలిపురం లీడర్ పరిధిలో గల ప్రాంతాలైన మధుబన్ కాలని, పద్మశాలి పురం, ఆపో్క కాలనీ, గాయత్రి స్కూల్, వివేకానంద విగ్రహం ప్రాంతం, శాతం రాయి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శాతం రాయి గ్రామం జిల్లాలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్తు వినియోగదారులు ఎంత రాయానికి సహకరించాలని ఆయన కోరారు.



## జేఎన్టీయూహెచ్‌లో ఘనంగా డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

### ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులు సమాజానికి తనవంతు కృషి చేయాలి:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

కూకట్ పల్లి, నవంబర్ 21 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి లోని జేఎన్టీయూహెచ్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు సమాజానికి తమ వంతుగా తిరిగి సహాయం చేయాలని సూచించారు. జేఎన్టీయూ అధికారులతో పాటు పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, టిపిసిసి ఉ పాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, కూకట్ పల్లి ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, నాయకులు ఫణి కుమార్, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, శివా చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## వందేమాతరం స్ఫూర్తి మరువలేనిది

### బీజేపీ నాయకులు అక్కెం మల్లేశ్‌యాదవ్

### దేశభక్తిని చాటిన వందేమాతరం..

రాజేంద్రనగర్,నవంబర్21(ప్రభాత ఉదయం)150 ఏళ్ల వందేమాతరం స్ఫూర్తి మరులేనిదని,వార్షికోత్సవ వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందని బీజేపీ నాయకులు అక్కెం మల్లేశ్‌యాదవ్ అన్నారు.వందేమాతరం 150 ఏళ్ల వార్షికోత్సవ వేడుకలను జరుపుకోవడాన్ని అభినందించారు.మైలార్ దేవ్ పల్లిలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో వందేమాతరం 150 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 120 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా అక్కెం మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ బొమ్మ రాజు నర్సింహ,వల్లూరి శ్రీనివాస్,శ్రీను,రామారావు, సీనియర్ నాయకుడు అక్కెం శివకుమార్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.ఈ ఉత్సవం దేశవ్యాప్తంగా జరుగుతున్న 150 ఏళ్ల వందేమాతరం సంబరాల్లో భాగంగా ఆనందంగా నిర్వహించారు.విద్యార్థుల భాగస్వామ్యం దేశభక్తి స్ఫూర్తిని పెంచడంలో ముఖ్యపాత్ర పోషించిందని గుర్తు చేశారు.నాయకులు సమిష్టిగా పాల్గొనడం ద్వారా స్థానికంగా కూడా చారిత్రక ఉత్సవానికి ప్రత్యేకతనిచ్చారు.విద్యార్థుల పరిశ్రమతో దేశభక్తికి ఊతమిచ్చే కార్యక్రమంగా నిలిచిందని వివరించారు.దేశవ్యాప్తంగా కొత్తతరం యువతకు వందేమాతరం ధ్వని పరిచయం చేయడంలో భాగంగా నిర్వహించారు.ఈ వేడుక ద్వారా వందేమాతరం గేయం దేశ స్ఫూర్తికి ప్రతీకగా కొత్త తరానికి,సమాజానికీ విశిష్ట స్ఫూర్తినిచ్చిందని వివరించారు.




పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేస్తున్న హైడ్రా సిబ్బంది

## కొండాపూర్‌లో 700 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

### 4 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

శేరిలింగంపల్లి: నవంబర్ 21 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ లో బడాబాబుల ఆగడాలకు హైడ్రా చెక్ పెట్టింది. పార్కులు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలకు బై నంబర్లు వేసి కొట్టేయాలని చేసే ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంది. 7 వందల కోట్ల రూపాయల విలువ చేసే దాదాపు 4 ఎకరాల పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని కాపాడి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు పెట్టింది. ఈ ప్రాంతంలో ఎకరం రూ. 200ల కోట్లు వరకూ ధర పలుకుతోంది. ఇలా కాపాడిన భూమి విలువ దాదాపు 700ల కోట్ల వరకు ఉంటుందని అంచనా. కొండాపూర్ గ్రామంలోని 57.20 ఎకరాల విస్తీర్ణంలో 627 ప్లాట్లతో శ్రీ వేంకటేశ్వర హెచ్ ఏ ఎల్ కాలనీని 1980లో ఏర్పాటు చేశారు. 1.20 ఎకరాల చొప్పున 2 పార్కులు, 2 ఎకరాల పరిధిలో మరో పార్కుతో పాటు. 1000 గజాల మేర ప్రజావసరాలకు లే అవుట్ లో స్థలాలను కేటాయించారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కొందరు అక్రమార్కులు బై నెంబర్ తో ఆక్రమించారు. పార్కులను బైనంబర్ల ద్వారా ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. ఇదే విషయమై దశాబ్దాలుగా పోరాడుతున్న శ్రీ వేంకటేశ్వర హెచ్ ఏ ఎల్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా ప్రజావాణిలో సంబంధిత పత్రాలతో ఫిర్యాదు చేశారు.రంగంలోకి దిగిన హైడ్రా నాలుగు ఎకరాల స్థలానికి ఫెన్సింగ్ వేసింది.

## ఏసీబీకి పట్టుబడిన చిక్కిన మిషన్ భగీరథ డిఈఈ



జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 21(ప్రభాత ఉదయం)జనగామ జిల్లా పాలకుర్తి మిషన్ భగీరథ డీఈఈ కూనమల్ల సంధ్యారాణి రూ. 10 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కింది. ఓ బాధితుడి వద్ద బిల్లు విషయమై రూ.10,000 లంచం అడగడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్టు సమాచారం. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

### ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

కూకట్ పల్లి, నవంబర్ 21 (ప్రభాత ఉదయం) త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ మహంకాళి నగర్ పరిధిలోని నాగమ్మ కాలనీ లో మంజీరా పైప్ లైన్ లేక త్రాగునీరు సమస్య ఉందని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కి తెలియచేయగా కార్పొరేటర్ కాలనీ లో పర్యటించి, సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్రాగునీరు కోసం మంజీరా పైప్ లైన్ నిర్మించే విషయాన్ని ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో మంజీరా పైప్ లైన్ సాంక్షన్ చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, నరసింహులు, ప్రకాష్, సాయిలు, మన్యం, ప్రేమ్, మదన్, నారాయణ, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ముందుంటా

### రామ్ నరేష్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

కూకట్ పల్లి, నవంబర్ 21(ప్రభాత ఉదయం) హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని రామ్ నరేష్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 12లో రూ.50 లక్షల అంచనాతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, కాలనీ వాసులతో కలసి స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పరిశీలించారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ... ప్రజలు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా డిపార్ట్మెంట్ వారికి సహకరించాలని కోరారు. పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు, మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో డివిజన్ లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం సమస్యలతో ఉన్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు, సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని పేర్కొన్నారు. అలానే అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని అన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, అదే విధంగా హైదర్ నగర్ డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్గా తీర్చిదితామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య కారులకు ప్రభుత్వం చేయూత

### తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

### మత్స్యకారుల జీవితాల్లో కొత్త వెలుగులు




రాజేంద్రనగర్,నవంబర్2(ప్రభాత ఉదయం)తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చెరువులు,కుంటలకు అధునాతన టెక్నాలజీని ఉపయోగించి వచ్చే జనవరి నుంచి ఏప్రిల్ లోగా మ్యాపింగ్ చేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మత్స్యకారుల సంఘాల నాయకులు,ఉత్తమ మత్సకారులకు శుక్రవారం రాజేంద్రనగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అవార్డులను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మత్స్య సహకార ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐదు వేల మత్స్య సహకార సంఘాలు,ఐదు లక్షల మంది సభ్యులు వారి కుటుంబాలను లక్షా మత్స్యకారుల చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందున్న పని అని గుర్తు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26వేల చెరువులు,101 రిజర్వాయర్లతో పాటు కుంటలను గుర్తించి వాటికి 2026 జనవరి నుంచి ఏప్రిల్ వరకు మ్యాపింగ్ చేయనున్నట్లు ప్రకటించారు.అందుకోసం ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు.చెరువులను, కుంటలను మత్యఉత్పత్తి కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.జిల్లాలో ఉన్న ప్రతిభావంతులైన మత్స్యకారులను గుర్తించి వారిని అవార్డులతో సన్మానిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.కార్యక్రమంలో మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల,శ్రీనివాస్,లక్ష్మీనారాయణతో పాటు పలువురు మత్సహకార సొసైటీల సభ్యులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608